

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

# కాంగ్రెస్‌ది మోసాల చరిత్ర

- ఓట్లకోసమే బీసీ డిక్లరేషన్
- బలహీనవర్గాల అభ్యున్నతికి బీపీ మండల్ విశేష కృషి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఆగస్టు 25: 'కాంగ్రెస్ అంటేనే మోసం.. దగా.. నాటి నుంచి నేటి వరకు ఆ పార్టీది అదే చరిత్ర' అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల వేళ బీసీ డిక్లరేషన్ పేరిట ఓట్లను కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. ఆదివారం బీపీ మండల్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంథనిలోని ఆయన విగ్రహానికి మధూకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వం కామారెడ్డి బీసీల డిక్లరేషన్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ హక్కుల దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత తొలి ప్రధాని నెహ్రూ పూటకో మాట మాట్లాడి బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడ్డారన్నారు. 2వేల ఎకరాల భూస్వామిగా ఉన్న బిందేశ్వరి ప్రసాద్ మండల్ దేశమంతా తిరిగి బీసీల కష్టాలు తెలుసుకుని బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే న్యాయం జరుగుతుందని కేంద్రానికి, రాష్ట్రపతికి విజ్ఞప్తిచేశారని గుర్తు చేశారు. 1990లో ఆయన ఇచ్చిన నివేదిక మేరకు వీపీ సింగ్ అమలు చేస్తానని ప్రకటిస్తే అప్పటి కాంగ్రెస్ సర్కారు వద్దని కోర్టుకు పోయిందన్నారు. కానీ సుప్రీంకోర్టు వారి వాదనను తిరస్కరించడంతో 1992లో బీపీ మండల్ రిపోర్ట్ ఆధారంగా 22శాతం రిజర్వేషన్లు అమలు చేసిందన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల టైంల బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఊదరగొట్టారని, కానీ ఇప్పుడు మాట కూడా మాట్లాడడం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఒక మాట..ఎన్నికల తర్వాత మరోమాట మాట్లాడి మభ్యపెడుతున్నారన్నారు. ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేసే వరకు పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. బీసీలంతా మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇందులో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, నాయకులు తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, పూదరి సత్యనా రాయణగౌడ్, కనవేన శ్రీనివాస్‌యాదవ్, సెగ్గెం రాజేశ్, మంథని లక్ష్మణ్, బత్తుల సత్యనారాయణ, కిషన్‌రెడ్డి, మాచీడి రాజుగౌడ్, ఆరెపల్లి కుమార్, ఆడిచర్ల సమ్మయ్య, బీసీ సంక్షేమ సంఘం పొన్నం నవీన్, తోట రాజ్‌కుమార్ ఉన్నారు.



ఎంపీవోను రప్పించాలని డీపీవోను నిలదీస్తున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

# ఎంపీవోపై వేటు వేయాల్సిందే!

- పరామర్శకు వచ్చిన డీపీవోపై కార్యదర్శి కుటుంబీకుల ఆగ్రహం
- విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ

రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ)/ఎల్లారెడ్డిపేట ఆగస్టు 25: గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న కిష్టారావుపల్లి కార్యదర్శిని పరామర్శించేందుకు వచ్చిన డీపీవో వీరబుచ్చయ్యను శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నిలదీశారు. ఇందుకు బాధ్యుడైన ఎంపీవో అబ్దుల్ వహీద్‌ను సస్పెండ్ చేయాలని, ఎంపీడీవోను పిలిపించాలని భార్య సరిత డిమాండ్ చేశారు. డీపీవో స్పందిస్తూ విచారణ జరుపుతున్నామని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్ కుటుంబసభ్యులు శాంతించారు.

### 16న కలెక్టర్‌కు దరఖాస్తు..

9 ఉద్యోగాలు పొందిన శ్రీనివాస్ కార్యదర్శి ఉద్యోగాన్ని వదులుకొనేందుకు ఈనెల 16న కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. అర్జీని పరిశీలించిన కలెక్టర్ 21న డీపీవోకు ఫార్వర్డ్ చేశారు. దానిని 22న ఇల్లంతకుంట మండల ఎంపీడీవోకు పంపించారు. పంచాయతీ అధికారి నివేదికను ఎంపీడీవో, డీపీవోకు ఇవ్వాల్సి ఉన్నది. ఈ క్రమంలో 23న ఎంక్వయిరీ చేసి నివేదిక రూపొందించారు. వచ్చేనెల 1వ తేదీలోగా శ్రీనివాస్‌ను రిలీవ్ చేయాల్సి ఉండగా, 24న ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. కాగా నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే రూ. 30వేలు డీపీవో డిమాండ్ చేసినట్లు శ్రీనివాస్ భార్య విలేకరుల ఎదుట ఆరోపించింది. శ్రీనివాస్ మాత్రం ఎంపీవో లంచమివ్వాలని ఇబ్బంది పెట్టాడని, కులం పేరుతో దూషించినట్లు వాంగ్మూలంలో చెప్పినట్లు తెలిసింది. ఈ ఘటనపై కలెక్టర్ విచారణకు అధికారులను ఆదేశించడంతో యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎంపీడీవో, ఎంపీవో, కార్యదర్శి మధ్య జరిగిన వివాదంపై విచారణ చేపట్టారు. ఈక్రమంలో డీపీవో, దవాఖానలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. కుటుంబ సభ్యుల డిమాండ్ మేరకు ఎంపీడీవో, ఎంపీవోలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీనివాస్ ఆత్మహత్యా యత్నానికి గల కారణాలపై ఉన్నతాధికారులు వేగంగా విచారిస్తున్నారు. రెండు రోజుల్లో చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించనున్నారు.

# ఎస్సారెస్పీ కాలువలో సిల్ట్ తొలగింపు




పిచ్చి మొక్కలు తొలగించిన తర్వాత ఎస్సారెస్పీ డీ83/బీ కాలువ

ఎస్సారెస్పీ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుందో.. లేదోనని అన్నదాతలు ఆందోళన చెందారు. ఈ క్రమంలో 'ఎస్సారెస్పీ కాలువలు ఇలా.. నీరు పారేదెలా' శీర్షికన ఇటీవలి నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎస్సారెస్పీ నీటిపారుదల, పంచాయత్‌రాజ్‌శాఖ అధికారులు స్పందించారు. ఈ క్రమంలో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతోపాటు చెత్తాచెదారాన్ని తొలగించి కాలువను శుభ్రం చేశారు. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

- వెల్గటూర్, ఆగస్టు 25

# నిర్ధారణకు వెళ్తే నిలువు దోపిడే!






## డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో అడ్డగోలు ఫీజులు

- సిండికేట్‌గా ఏర్పడి దోచుకుంటున్నారని ఆరోపణలు
- వెల్లువలా ప్రజా సంఘాల ఫిర్యాదులు
- పట్టించుకోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

**కరీంనగర్ జిల్లా కేంద్రంలో** వ్యాధి నిర్ధారణ అతి పెద్ద వ్యాపారంగా మారింది. మామూలు జ్వరంతో బాధపడుతూ ఏ ప్రైవేట్ దవాఖానకు వెళ్లినా.. ఏ చిన్న వ్యాధితో వైద్యుడిని సంప్రదించినా.. ముందుగా వ్యాధి నిర్ధారణ కోసం డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపించడం ఆనవాయితీగా మారింది. దీనిని ఆసరా చేసుకుని ఆయా సెంటర్ల నిర్వాహకులు రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అసోసియేషన్ పేరుతో సిండికేట్‌గా ఏర్పడి మరీ దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలి కాలంలో 30 శాతం ఫీజులు పెంచిన డయగ్నోస్టిక్ సెంటర్లపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అయితే తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. దీంతో ప్రస్తుత జ్వరాల సీజన్‌లో డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు విపరీతమైన దోపిడీకి తెరతీసి వచ్చిన వారిని వచ్చినట్లు పీల్చి పిప్పి చేస్తున్నట్లు తెలుస్తోంది.

- కరీంనగర్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్


చిన్న జ్వరం వచ్చి ఏ ప్రైవేట్‌లో దవాఖానకు వెళ్లినా వైద్యులు రకరకాల పరీక్షల పేరుతో డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపుతుండగా, ఇదే అదనుగా ఆయా సెంటర్ల నిర్వాహకులు ఒక్కో పరీక్ష నిర్ధారణకు వేలకు వేల ఫీజులు గుంజుతున్నారు. మామూలు జ్వరంతో వెళ్లిన రోగులకు ఒక్క రక్తానికి సంబంధించినవే నాలుగైదు పరీక్షలు చేయిస్తున్నారు. మూత్ర పరీక్షలు అదనంగా నిర్వహించడం సాధారణమైంది. తీరా ఏ పరీక్షలో ఏమీ లేదు.. అంతా సాధారణంగానే ఉందని, జ్వరానికి సంబంధించిన మందులు రాసి రోగులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. ఇక ఏవైనా వ్యాధులతో దవాఖానాల్లో అడుగు పెడితే చాలు వైద్యానికంటే ఎక్కువ డయాగ్నోస్టిక్ సెంటర్లకే దారపోయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎక్స్‌రే వంటి విభాగాల్లో దేనికైనా రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. చిన్న జబ్బులతో దవాఖానల గడప తొక్కుతున్న వారికి అడ్డగోలుగా పరీక్షలు రాయడం, నిర్ధారణ కేంద్రాల్లో దోచుకోవడం కరీంనగర్ జిల్లా కేంద్రంలో మామూలు విషయమై పోయింది.

### సిండికేట్‌గా ఏర్పడిన నిర్వాహకులు

వ్యాధి నిర్ధారణ కోసం వెళ్తే గతంలో ఒక్కో డయాగ్నోస్టిక్ కేంద్రంలో అక్కడ ఉన్న వైద్య పరికరాల నైపుణ్యతను బట్టి ఈ ధరలు ఉండేవి. ఈ నేపథ్యంలో తక్కువ ఫీజులు తీసుకునే డయాగ్నోస్టిక్ కేంద్రాలకు రోగులు ఎక్కువగా వెళ్లేవారు. గత మూడు నెలలుగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే రకమైన ఫీజులు తీసుకుంటున్నారు. ఎందుకంటే గత జూన్ 1 నుంచి అన్ని డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో అసోసియేషన్ పేరుతో బోర్డులు వెలిశాయి. వాటి ప్రకారమే వ్యాధి నిర్ధారణకు ఫీజులు తీసుకుంటున్నామని నిర్వాహకులు గట్టిగా వాదిస్తున్నారు. ఫీజుల వసూలుకు ఒక నిబద్ధత, నియంత్రణ అనేది లేకుండా పోయింది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఈ సెంటర్లను నియంత్రించే అధికారం తమకు లేదని వారు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో అసోసియేషన్ పేరుతో సిండికేట్‌గా ఏర్పడి రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారని పలు ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. చట్టంలో లొసుగులను ఆసరా చేసుకుని అడ్డగోలుగా దోస్తున్నారని, నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### వీళ్లకెలా సాధ్యం?

కరీంనగర్ జిల్లాలో మొత్తం 33 డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ఎక్కువగా కరీంనగర్‌లోనే ఉన్నాయి. సేవా భావం కంటే వ్యాపార కోణంలోనే ఇవి పనిచేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల బారి నుంచి రోగులకు కాస్తయినా ఉపశమనం కలిగించాలనే భావనతో కొన్ని ఉదార సంస్థలు డయాగ్నోస్టిక్ సెంటర్లు నెలకొల్పాయి. వీటికి, ప్రైవేట్ సెంటర్ల మధ్య ఫీజుల విషయంలో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. ఉదార సంస్థల్లో చేసే సీటీ బ్రెయిన్ స్కాన్‌కు రూ.800 అవుతుంటే ప్రైవేట్ కేంద్రాల్లో మాత్రం రూ.2 వేలు తీసుకుంటున్నారు. రూ.2 వేలతో తీసే సీటీ స్కాన్లకు రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. సీటీ పీఎన్ఎస్ స్కాన్‌కు ఉదార సంస్థ రూ.800 తీసుకుంటుంటే ప్రైవేటు సెంటర్లు మాత్రం రూ.2,500 వసూలు చేస్తున్నాయి. ఇలా ప్రతి దానిపై నాలుగైదింతలు ఫీజు వసూలు చేస్తున్నతీరు ఆశ్చర్యానికి గురి చేస్తోంది. జిల్లా కేంద్రం సమీపంలోని రెండు ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న దవాఖానాల్లోనూ డయాగ్నోస్టిక్ ఫీజులు నియంత్రణలోనే ఉన్నాయి. మరి వీళ్లకు ఎలా సాధ్యమవుతోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతే కాదు.. ఈ కళాశాలల్లో ఇతర డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో కంటే విలువైన వైద్య పరికరాలు ఉన్నట్లు తెలుస్తోంది.



| | | |
|---|---|---|
| | **CT Scan Charges** | |
| 1 | CT Brain | 800.00 |
| 2 | CT PNS | 800.00 |
| 3 | CT Facial Bone 3D | 2000.00 |
| 4 | CT Orbits | 2000.00 |
| 5 | CT Mastoids | 2000.00 |
| 6 | CT Chest | 2000.00 |
| 7 | CT Abdomen | 2000.00 |
| 8 | CT KUB | 2000.00 |
| 9 | CT PELVIS With 3D | 2000.00 |
| 10 | CT Spine | 2000.00 |
| 11 | CT Joint | 2000.00 |
| 12 | CT Angio | 5000.00 |
| 13 | CT Urography | 5000.00 |
| 14 | CT Contrast | 1500.00 |
| 15 | CT Extra Charges | 1000.00 |
| | **Blood & Urine Tests** | |
| 16 | CBP | 50.00 |
| 17 | Urine Test | 20.00 |
| 18 | Urine for Keytone | 20.00 |
| 19 | CT, BT | 30.00 |
| 20 | Blood Group | 20.00 |
| 21 | ESR | 20.00 |
| | **Bio Chemistry** | |
| 22 | LFT | 200.00 |
| 23 | Lipid Profile | 300.00 |
| 24 | Serum Electrolytes | 200.00 |
| 25 | Serum Uric Acid | 30.00 |
| 26 | Troponin - (T) | 400.00 |
| 27 | Troponin - (I) | 400.00 |
| 28 | Serum Calcium | 30.00 |
| 29 | HbA 1C | 200.00 |
| 30 | RBS | 10.00 |
| 31 | FBS | 10.00 |
| 32 | PLBS | 10.00 |
| 33 | Serum Bilirubin | [illegible] |
| 33 | APTT | 200.00 |
| 34 | Blood Urea | 30.00 |
| 35 | Serum Creatinine | 30.00 |
| 36 | Serum Phosphorus | 200.00 |
| 37 | T3, T3, TSH | 150.00 |
| 38 | PT INR | 200.00 |
| | **Other Tests** | |
| 39 | Serum Lipase | 200.00 |
| 40 | Widal | 20.00 |
| 41 | RA Factor | 50.00 |
| 42 | Dengue | 250.00 |
| 43 | VDRL | 50.00 |
| 44 | Gravindex (Urine PT) | 30.00 |
| 45 | HIV | 100.00 |
| 46 | HCV | 150.00 |
| 47 | HBS Ag | 50.00 |
| 48 | MP | 50.00 |
| 49 | CRP | 150.00 |
| 50 | ASO | 60.00 |
| 51 | D-Dimer | 400.00 |
| 52 | AEC | 200.00 |
| 53 | Vitamin-D3 | 600.00 |
| 54 | Vitamin-B12 | 400.00 |
| 55 | FSH | 200.00 |
| 56 | LH | 200.00 |
| 57 | Prolactine | 200.00 |
| 58 | Testosterone | 300.00 |
| 59 | AMH | 850.00 |
| 60 | Serum Amylase | 200.00 |
| 61 | Iron Profile | 850.00 |
| 62 | Urine Culture | 300.00 |
| 63 | ANA Profile | 1800.00 |
| 64 | Anti CCP | 900.00 |
| 65 | Free Thyroid | 400.00 |
| 66 | PSA | 550.00 |
| 67 | IGE | 550.00 |
| 68 | HLA B27 | 850.00 |

ఓ ఉదార సంస్థలో ధరల పట్టిక



KARIMNAGAR RADIOLOGISTS and IMAGING ASSOCIATION (KRIA)

PRICE LIST (w.e.f. 01.06.2024)

ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఫీజుల పట్టిక..

### నియంత్రించే చట్టమే లేదా?

ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి. ఈ విషయమై వారిని అడిగితే తామేమీ చేయలేమనే నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. డీఆర్ఏ చట్టంలో చర్యలు తీసుకోవడానికి ఎలాంటి నిబంధనలూ లేవని చెబుతున్నారు. ఫీజు ఎంత వసూలు చేస్తున్నారనేది కాదని, వసూలు చేస్తున్నది డయాగ్నోస్టిక్ సెంటర్‌లోగాని, ప్రైవేట్ దవాఖానల్లోగానీ ప్రదర్శిస్తున్నారా? లేదా చూడాలని మాత్రమే చట్టంలో ఉందని అధికారులు చెబుతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని బరితెగిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకుల చర్యలను అరికట్టేదెవరని రోగులు ప్రశ్నిస్తున్నారు. అది డయాగ్నోస్టిక్ సెంటర్ అయినా ప్రైవేట్ దవాఖానా అయినా అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు ఏంటి?, వాటి నైపుణ్యత ఏ స్థితిలో ఉంది?, వాటి ద్వారా నిర్ధారిస్తున్న వ్యాధుల నివేదికల స్థితి ఏంటనేది పరిశీలించి, వాటిని బట్టి ఒక నిర్దిష్టమైన ఫీజులు నిర్ధారించేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీ వేస్తే బాగుంటుందని, అలాంటప్పుడే రోగులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

### రోగులతో వైద్యుల చెలగాటం?

ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీకి తోడు వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్నారు. తక్కువ ధర ఉన్న సెంటర్లకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాలను రెఫర్ చేసిన వైద్యులు అంగీకరించడం లేదు. రక్త, మూత్ర పరీక్షలు సదరు ప్రైవేట్ దవాఖానలకు అనుబంధంగానే ఎక్కువగా నిర్వహిస్తుంటారు. చిన్న చిన్న స్కానింగ్‌లు కూడా కొన్ని దవాఖానల్లో అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు డయాగ్నోస్టిక్ సెంటర్లను చూసి వీళ్లు కూడా నిర్ధారణ పరీక్షల ఫీజులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా డాక్టర్లకు డయాగ్నోస్టిక్ సెంటర్లకు విడదీయరాని కమీషన్ల బంధం ఉందనేది జగమెరిగిన సత్యం. ఫలానా డయాగ్నోస్టిక్ సెంటర్‌కే వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కొందరు వైద్యులు రోగులకు ఆర్డర్లు వేస్తుంటారు. వారు చెప్పినట్లు వినక ఇతర సెంటర్లకు వెళ్తే వ్యాధి నిర్ధారణ సరిగా లేదని వంకలు పెట్టడం కరీంనగర్‌లో పరిపాటిగా మారింది. వ్యాధి నిర్ధారణ ఎలా ఉన్నా ఫరావా లేదు.. తమకు కమీషన్లు వస్తే చాలనుకునే వైద్యులు కోకొల్లలు.

### అడ్డగోలుగా దోచుకుంటున్నారు



కరీంనగర్‌లోని ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. గతంలో కొన్ని సెంటర్లలో ఫీజులు తక్కువ ఉండేవి. ఆయా సెంటర్లలో ఉండే ఎక్విప్‌మెంట్స్‌ను బట్టి ఫీజులు తీసుకునేవారు. గత మూడు నెలలుగా చిన్న, పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్ ఏదైనా ఒకే రకమైన ఫీజులు వసూలు చేస్తున్నారు. అసోసియేషన్ పేరుతో నిర్వాహకులంతా సిండికేట్ అయ్యారు. దేనికి ఎంత తీసుకోవాలో నిర్ణయించుకున్నారు. ఇంతకంటే తక్కువ ఫీజు తీసుకుంటే రూ.5 లక్షలు జరిమానా విధించాలని నిబంధన పెట్టుకున్నారు. ఇది పేదల మీద విపరీతమైన ప్రభావం చూపుతోంది. వ్యాధి నిర్ధారణ కోసం అష్టకష్టాలు పడుతున్నారు. మందులకంటే ఎక్కువ స్కానింగ్‌లకు అవుతున్నాయని వాపోతున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. నేనే స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఫీజులు నియంత్రించకుంటే పేదలు తమ రోగాలకే ఉన్నదంతా సమర్పించుకోవల్సి వస్తుంది. అప్పులపాలుకాక తప్పదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డయాగ్నోస్టిక్ సెంటర్ల చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఉన్నది.

- ఎడ్ల రమేశ్, సీఐటీయూ కార్యదర్శి

# కదులుతున్న అవినీతి డొంక!

- రాజన్న ఆలయం ఉద్యోగి సస్పెన్షన్.. మరొకరి సరెండర్
- విజిలెన్స్ ఆరోపణల నేపథ్యంలో ఈవో చర్యలు
- జూనియర్ అసిస్టెంట్ వేతనంలో కోతకు ఆదేశం



ఆలయంలో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

వేములవాడ, ఆగస్టు 25: రాజన్న ఆలయంలో అవినీతి డొంకలు కదులుతున్నాయి. విజిలెన్స్ ఆరోపణల నేపథ్యంలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని సస్పెండ్ చేసి, మరో ఉద్యోగిని సంబంధిత ఏజెన్సీకి సరెండర్ చేస్తూ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ వేతనంలో కోతకు ఆదేశాలు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2021అక్టోబర్‌లో జరిగిన విజిలెన్స్ తనిఖీల్లో అవినీతి బాగోతం బయటపడింది. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ముగ్గురు ఏఈవోలు, నలుగురు పర్యవేక్షకులు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లతోపాటు ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో కలిపి 12మందిపై చర్యలకు ఉపక్రమించారు. ముగ్గురు ఏఈవోలకు ఇప్పటికే ఇంక్రిమెంట్లు నిలిపివేశారు. అలాగే లడ్డూ ప్రసాదాల విభాగం పర్యవేక్షకుడికి రూ.లక్షా88వేలు, అదే విభాగంలో పని చేసిన జూనియర్ అసిస్టెంట్‌కు రూ.80వేలు, గోదాములో సరుకుల వ్యత్యాసానికి సంబంధిత పర్యవేక్షకుడు రూ.21వేలు చెల్లించాలని గత ఏప్రిల్‌లో అప్పటి ఈవో కృష్ణప్రసాద్ ఆదేశించారు. అయితే లడ్డూ ప్రసాదాల విభాగం, గోదాం పర్యవేక్షకులు సదరు నగదు స్వామివారి ఖజానాకు చెల్లించగా, జూనియర్ అసిస్టెంట్ మాత్రం చెల్లించలేదు. గత జూలైలో ఈవో వినోద్‌రెడ్డి సైతం నగదు చెల్లించాలని జూనియర్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా సదరు ఉద్యోగి యాదగిరిగుట్టకు బదిలీ అయ్యారు. తక్షణమే నగదు చెల్లించకుంటే యాదగిరిగుట్ట పరిపాలన కార్యాలయం ద్వారా వేతనాన్ని రాజన్న ఆలయ ఖజానాకు చెల్లించేలా ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సదరు ఉద్యోగి రెండు, మూడు రోజుల్లో నగదు చెల్లిస్తానని అధికారులను వేడుకున్నట్లు తెలిసింది.

### సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు

విజిలెన్స్ ఆరోపణ నేపథ్యంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్న మధును సస్పెండ్ చేసి, తాత్కాలిక ఒప్పంద ఉద్యోగి శ్రీనివాస్‌ను సంబంధిత ఏజెన్సీకి సరెండర్ చేస్తూ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ ఆరోపణలు ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పట్టణానికి చెందిన ఒకరు ఇటీవల లోకాయుక్తను ఆశ్రయించిన నేపథ్యంలో కాంట్రాక్టు ఉద్యోగులపై వేటుపడినట్టు తెలిసింది.

### తనిఖీలతో దిద్దుబాటు చర్యలు

రాజన్న ఆలయంలో ఏసీబీ తనిఖీలతో శాఖాపరమైన దిద్దుబాటు చర్యలకు అధికారులు ఉపక్రమించారు. ఈ క్రమంలో శాఖలవారీగా వివరాలపై ఆరా తీశారు. తనిఖీల్లో బయటపడిన అక్రమాలను ఏసీబీ అధికారులు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ప్రకటించడంతో, ఆలయ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రధానంగా నెయ్యి, జీడీ పప్పు, నూనె వంటి నిల్వల్లో వ్యత్యాసాలు, కల్యాణ కట్టలో భక్తుల నుంచి అక్రమ వసూళ్ల వ్యవహారం, టెండర్లలో వ్యత్యాసాలపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఆకట్టుకుంటున్న బీర్‌పూర్ గుట్టలు



# బీర్‌పూర్ పెద్దగుట్టపై పురి విప్పిన ప్రకృతి

సారంగాపూర్, ఆగస్టు 25: తీరొక్క చెట్లతో కనుచూపుమేర పరుచుకున్న పచ్చదనం..చుట్టూ పచ్చని పొలాలు..ఇలా బీర్‌పూర్ పెద్దగుట్ట ప్రకృతి అందాలతో అలరారుతున్నది. జగిత్యాల నుంచి 25 కిలోమీటర్ల దూరంలోని ఈ కొండపై లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నిత్యం భక్తులతో కళకళాడుతున్నది. కొండపై ప్రకృతి రమణీయ దృశ్యాలు భక్తులు, ప్రకృతి ప్రేమికులను మైమరిపింపజేస్తున్నాయి.

# ఉమ్మడి జిల్లా సైక్లింగ్ పోటీలకు స్పందన



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి, ఆగస్టు 25 : కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరు కాగా పోటీలను అసోసియేషన్ చైర్మన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర మధుసూదన్‌రెడ్డి, సురభి వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషిచేసినవారమవుతామన్నారు. సైక్లింగ్‌కు కరీంనగర్‌లో మంచి ఆదరణ ఉందని, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గతంలో రెండుసార్లు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలను ఇక్కడ నిర్వహించినట్లు గుర్తు చేశారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14 బాలుర విభాగంలో వీ గౌతమ్, ఎం నాగసాయి, వీ నేహార్, కే అనిరుద్, పీ శ్రేష్, బీ అక్షయ్ ఎంపిక కాగా, అండర్-16 విభాగంలో ఎస్ ఆర్ లికిల్, అనిష్, అండర్-18 విభాగంలో హృతికేశ్, నిషద్జ్, జే సంజన్ అదిత్య, అండర్-23 పై విభాగంలో వీ వేణుగోపాల్, రెహన్, కోటేశ్వర్‌రావు, అఖిల్, సీ అశోక్ కూమార్ ఎంపికయ్యారు. ఈ పోటీల్లో సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు ఎన్ వేణుగోపాల్, ఇనుగుర్తి రమేశ్, అరవింద్ బాబు, ఆన్వేశ్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# గంజులు మోసి.. అన్నం వడ్డించుకుని..

వడ్డించేవారు లేక మహాత్మాజ్యోతిబా పూలే గురుకులంలో విద్యార్థుల ఇబ్బందులు



గురుకుల పాఠశాలలో తోటి మిత్రులకు వడ్డిస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఆగస్టు 25: గురుకులంలో సీటు వస్తే పిల్లలు బాగా చదువుకుంటారని తల్లిందండ్రులు హాస్టల్‌లో వేస్తే.. అక్కడ మాత్రం సమస్యలతో విద్యార్థులు తల్లడిల్లిపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 450మంది విద్యార్థులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం డైనింగ్‌హాల్‌లో తోటి మిత్రులకు విద్యార్థులే అన్నం వడ్డించగా, కేవలం ఒకే ఒక్క ఉపాధ్యాయురాలు పర్యవేక్షించింది. ప్రతి రోజూ సిబ్బంది కేవలం వంట చేసి వెళ్లిపోతారని, తర్వాత తామే వంట గంజులు మోసుకుని.. డైనింగ్‌హాల్‌లో పెట్టుకుని అందరికీ వడ్డిస్తామని క్లాస్ లీడర్స్ చెబుతున్నారు. గతంలో చదువు, భోజనం బాగుండేవని.. ప్రస్తుతం గురుకులాల్లో సమస్యలతో పిల్లలు ఉండే పరిస్థితి లేదని ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.